క్లుప్తంగా

పశుపోషకులు టీకా తప్పనిసరిగా వేయించాలి

- పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి


విడపనకల్లులో గాలికుంటు వ్యాధి టీకా వేస్తున్న జేడీ, డీడీ, ఏడీలు

ఉరవకొండ: పశువులకు సంక్రమించే వ్యాధులపై పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని, టీకా తప్పనిసరిగా వేయించాలని పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ వెంకటస్వామి తెలిపారు. శనివారం విడపనకల్లు గ్రామ పశువైద్య శాలలో గాలికుంటు వ్యాధి టీకా, బ్రూసెల్లోసిస్ టీకా కార్యక్రమం ప్రారంభించారు. ఉరవకొండ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వెంకటేష్‌తో కలిసి జేడీ ఈకార్యక్రమాన్ని ప్రారంభించారు. జేడీ మాట్లాడుతూ గాలికుంటు టీకా ఆవులు, గెదేలు, దూడలకు తప్పని సరిగా వేయించాలన్నారు. 4 నెలల నుంచి 8 నెలల లోపు ఉన్న దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకా వేయించాలన్నారు. కార్యక్రమంలో 650 పశువులకు గాలికుంటు టీకాలు, బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలు 30 దూడలకు ఉచితంగా వేయించారు. కార్యక్రమంలో ఏడీ పెద్దన్న, సిబ్బంది రమేష్‌బాబు, ప్రత్యూష, వన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు తూకాలు

కూడేరు: నిబంధనల మేరకు కందుల తూకాలు ఉండాలని ఏఓ విజయకుమార్ సూచించారు. కూడేరులో లక్ష్మీనరసింహ మ్యాక్స్ కోఆపరేటివ్ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాలను ఏఓ విజయకుమార్ శనివారం తనిఖీ చేశారు. పి.నారాయణపురం, కూడేరులో కందుల కొనుగోలుచేస్తున్నట్లు తెలిపారు. క్వింటా రూ. 7,550తో కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఏఈఓ శైలజ, కొనుగోలు కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీపై కేసు నమోదు చేయాలి


ఆర్‌ఎంపీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న సీపీఎం నాయకులు

రాయదుర్గంటౌన్: ఆర్‌ఎంపీ వైద్యుడిపై కేసు నమోదు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఏరియా ఆస్పత్రి ఎదుట నిరసన తెలియజేశారు. అంతకుముందు మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున మాట్లాడుతూ ఆర్‌ఎంపీ వైద్యం వికటించి, మృతి చెందిన విజయ్ కుటుంబ సభ్యులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణం ఆర్‌ఎంపీ వైద్యుడు చన్నవీర క్లినిక్‌ను సీజ్ చేయాలన్నారు.ఫిజియోథెరపీ క్లినిక్ అనిపేరు పెట్టుకుని లోపల రకరకాల మందులు, ఇంజక్షన్లు ఇస్తూ ప్రాణాలు తీస్తున్నట్లు చెప్పారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన


విత్తనశుద్ధి చేసే పద్ధతిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న పీఎండీఎస్ సిబ్బంది

గుమ్మఘట్ట: ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై డివిజన్ ఇన్‌చార్జ్ భీమన్న, యూనిట్ ఇన్‌చార్జ్ సత్యనారాయణ తదితరులు రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని 75 వీరాపురం శంకర్‌నాయక్ పొలంలో పీఎండీఎస్ పద్ధతిలో విత్తనాల శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. పీఎండీఎస్ పద్ధతిలో ఐదు రకాల పంటలైన సజ్జ, కంది, ఆముదం, అనుములు, గోరుచిక్కుడు తదితర 20 రకాల పంటలపై తెలియజేశారు. కార్యక్రమంలో సిబ్బంది బాలునాయక్, ప్రభుదేవా, ఎస్‌ఎఫ్‌ఐ నీలుబాయి, రైతులు పాల్గొన్నారు.

అన్నదానం


మద్దానేశ్వర స్వామి ఆలయంలో అన్నదానం చేస్తున్న దృశ్యం

గుమ్మఘట్ట: రాయదుర్గం మండలంలోని 74 ఉడేగోళం గ్రామం మద్దానేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు బసవరాజు శనివారం తెలిపారు. పశువుల జాతరను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం ఏటా అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో దేవరెడ్లపల్లి రామిరెడ్డి, కొత్తపల్లి సత్యనారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ రామకృష్ణారెడ్డి, బేలోడు సర్పంచ్ ఉమేష్, సుధాకర్‌రెడ్డి, జయన్న, డిష్ అప్పాజి, మంజునాథ, తిప్పేస్వామి, ఉలిగప్ప, జయరామిరెడ్డి, రామాంజనేయులు, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

అడ్డాగా మారిన కంపచెట్లు:

కూడేరు హైస్కూల్‌లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు–నేడు పథకం కింద మరుగుదొడ్లు, అదనపు తరగతుల గదుల నిర్మాణానికి రూ.లక్షల నిధులు మంజూరు చేసింది. అప్పటి ప్రధానోపాధ్యాయుడు పనులు సక్రమంగా చేయించకపోవడంతో బాలుర మరుగుదొడ్ల నిర్మాణం అర్ధంతరంగా ఆగిపోయింది. బాలికలకు 5 మరుగుదొడ్లు ఉన్నాయి. మరుగుదొడ్లు లేకపోవడంతో మగపిల్లలు మలవిసర్జనకు పాఠశాలకు దగ్గరలో జాఫర్ పిండి మిషన్ ముందు ఖాళీ స్థలంలో పెరిగిపోయిన కంపచెట్ల మాటుకు వెళ్తున్నారు. ఈ కంప చెట్లే పిల్లలు చెడు మార్గంలో వెళ్లడానికి అడ్డాగా మారాయి. మూత్ర విసర్జనకంటూ అక్కడికి వెళ్లడం.. బీడీలు, సిగరెట్లు తాగడం చేస్తున్నారు. ఒకరిని చూసి మరొకరు అలవాటు చేసుకోవడం అధికమైంది. పిల్లలు బయటకు వెళుతున్నా హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



భావి పౌరులు..
వ్యసనాలకు బానిసలు

- కూడేరు హైస్కూల్లో 15 ఏళ్లలోపు విద్యార్థులు బీడీ,సిగరెట్, గుట్కాలకు బానిస
- తల్లిదండ్రుల గారాభం తెస్తోంది చేటు
- అడిగినంత డబ్బులిస్తున్న తల్లిదండ్రులు
- పెడదోవ పడుతున్న బాల్యం
- భవిష్యత్‌ను చేతులారా నాశనం చేసుకుంటున్న వైనం

కూడేరు: బాగా చదివి భావి పౌరులుగా ఎదగాల్సిన ఆ విద్యార్థులు బంగారు బాల్యాన్ని బుగ్గి చేసుకుంటున్నారు. ఉన్నత విద్యనభ్యసించి ఉన్నతంగా ఎదగాల్సిన వారి జీవితాలు బీడీ, సిగరెట్, గుట్కాలాంటి వ్యసనాలతో 'పొగ' చూరుతున్నాయి. పదిహేనేళ్లలోపే 'మత్తు'కు అలవాటు పడి భవిష్యత్ చిత్తు చేసుకుంటున్నారు. తల్లిదండ్రుల గారాభం.. ఉపాధ్యాయుల పర్యవేక్షణ కొరవడడంతో తోటి విద్యార్థులు తోడై పెడదోవ పడుతున్నారు. చిరుప్రాయం నుంచే క్రమశిక్షణతో ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాల్సిన పిల్లలు.. అవసరానికి మించి డబ్బులిస్తుండడంతో జల్సాలకు అలవాటు పడుతున్నారు. చెడుమార్గంలో వెళ్లి వారి ఆశయాలు, తల్లిదండ్రుల ఆశలను ఆదిలోనే తుంచేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా నగరానికి పొరుగున ఉండే కూడేరు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు విద్యార్థులను పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుంచి 10 వ తరగతి వరకు మొత్తం 454 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పలువురు బాలురులు బీడీ సిగరెట్, గుట్కా, కల్లుకు బానిసవుతున్నారు. ఆరు నెలల క్రితం వరకు 9,10వ తరగతి పిల్లల్లో కొందరు వ్యసనాలకు అలవాటు పడ్డారు. నెల రోజులు నుంచి వారిని చూసి 6, 7,8వ తరగతి పిల్లలు కూడా అదేబాటలో నడుస్తున్నారు. తొలుత రూపాయి పెట్టి చుట్ట బీడీ తాగడం మొదలెట్టి .. తర్వాత రూ.10ల విల్స్, రూ.12 పెట్టి గోల్డ్ సిగరెట్లకు అలవాటు పడ్డారు. తాజాగా వారి ధ్యాస గుట్కా వైపు మళ్లింది. రూ.10, రూ.20 పెట్టి విమల్, చైనీ ఖైనీ వంటి గుట్కాలను వాడుతున్నారు.

వ్యసనాలను 'కొని' తెచ్చుకుంటున్నారు..

కొందరు పిల్లలకు చదువుపై ధ్యాస లేదు. టీవీలు, సినిమాలు, సెల్‌ఫోన్‌లో యుట్యూబ్‌లో బీడీలు, సిగరెట్లు తాగడం, గుట్కాలు వేసుకోవడం ఫ్యాషన్‌గా తీసుకొని వీరు బానిసలవుతున్నారు. ధూమపానం చేయడం ద్వారా ఊపిరితిత్తులు దెబ్బతింటాయని, గుట్కా వేసుకోవడంతో నోటి కేన్సర్ వస్తుందన్న విషయం తెలియక డబ్బు పెట్టి జబ్బులు కొని తెచ్చుకుంటున్నారు.

పిల్లల భవిష్యత్ నాశనం



పెద్దవారే బీడీలు, సిగరెట్లు తాగి, గుట్కా వేసుకోవడంతో ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రులు చుట్టూ తిరుగుతున్నారు. మరీ చిన్నపిల్లలు వీటికి బానిస కావడం దారుణం. అడ్డుకట్ట వేయకపోతే చదువుపై శ్రద్ధ చూపకపోగా మరింత వ్యసన పరులై చేతులారా భవిష్యత్ నాశనం చేసుకుంటారు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు డబ్బులివ్వడం మంచిది కాదు.

– లక్ష్మీనారాయణ, మండల వైద్యాధికారి, కూడేరు

నిఘా ఉంచుతాం..



కొందరు పిల్లలు బీడీలు, సిగరెట్లు తాగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. తరగతి గదుల్లో ఉండకుండా బయట తిరుతున్న పిల్లలపై నిఘా ఉంచాం. అల్లరి, చిల్లరిగా తిరిగే పిల్లల విషయాన్ని వారి తల్లిదండ్రులను పిలిపించి తెలియజేశాం. మగపిల్లలకు మరుగుదొడ్లు లేకపోవడం సమస్యగా మారింది. మలమూత్ర విసర్జనకంటూ పిల్లలు బయటకు వెళుతున్నారు. ధూమపానం, గుట్కాకు అలవాటు పడిన పిల్లలపై తోటి పిల్లలతో నిఘా పెట్టిస్తాం.

– శ్రీదేవి, హెచ్‌ఎం, కూడేరు హైస్కూల్

పన్ను వసూళ్ల లక్ష్యం రూ.21 కోట్లు

- జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు


కణేకల్లులో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ నాగరాజు నాయుడు

కణేకల్లు: 2024–25లో జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల ద్వారా రూ.21 కోట్ల పన్ను వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు డీపీఓ నాగరాజు నాయుడు తెలిపారు. కణేకల్లు మేజర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సంపద తయారీ కేంద్రాన్ని కణేకల్లు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రసాద్‌తో కలిసి డీపీఓ శనివారం సందర్శించారు. కణేకల్లు సంపద తయారీ కేంద్రం జిల్లాలోనే ఆదర్శంగా ఉందన్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలో 575 పంచాయతీల్లో ఇంటి పన్ను, నాన్ ట్యాక్స్‌లు కలిపి రూ.21 కోట్ల వసూళ్లు చేయాలని లక్ష్యం పెట్టుకోగా, ఇప్పటి వరకు రూ.12 కోట్లు వసూలయినట్లు తెలిపారు. కణేకల్లు పంచాయతీలో రూ.46 లక్షల పన్ను వసూలు కావాల్సి ఉండగా, రూ.20 లక్షలు వసూలైనట్లు చెప్పారు.

ప్రతి ఇంటా చెత్త సేకరించాలి

కూడేరు: రోజూ ఉదయం 6 నుంచి 10 గంటల వరకు ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించాలని క్లాప్ మిత్రలకు డీపీఓ నాగరాజు నాయుడు ఆదేశించారు. శనివారం మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టారు. కొర్రకోడులో ఇంటింటా చెత్త సేకరణను డీపీఓ తనిఖీ చేశారు. ప్రతి క్లాప్ మిత్ర కేటాయించిన 250 ఇళ్ల నుంచి చెత్తను సేకరించి చెత్తతో సంపద తయారీ కేంద్రానికి తరలించాలని ఆదేశించారు. అంతక ముందు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఈఓఆర్డీ రాధాకృష్ణతో ఆయన సమావేశమయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, పంచాయతీ కార్యదర్శి వెంకటనారాయణ , క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో టీడీపీ నేతల పెత్తనం


అధికారుల కుర్చీలో దర్జాగా కూర్చున్న టీడీపీ నేతలు


కళ్యాణదుర్గం: బ్రహ్మసముద్రం మండల పరిషత్ కార్యాలయం టీడీపీ నేతలకు అడ్డాగా మారింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పార్టీ నేతలే అధికారులుగా వ్యవహరిస్తూ అధికారులపై పెత్తనం చెలాయిస్తున్నారు. రెండు రోజుల క్రితం ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్లు కూర్చునే కుర్చీలో మాజీ ఎంపీపీ మంజుళ భర్త వన్నూరుస్వామి, ఎస్. కొండాపురం సర్పంచు భర్త మల్లికార్జున, ఈనాడు విలేకరి మంజు దర్జాగా కూర్చుని సిబ్బందిపై పెత్తనం చెలాయించారు. ఇదేమిటని ప్రశ్నించే ధైర్యం లేక అధికారులు సైతం మిన్నకుండిపోయారు. అధికారులు కూర్చున్న చోట టీడీపీ నేతలు కూర్చుంటూ తమనెవరూ ఏమీ చేయలేరంటూ...తాము చెప్పిందే వినాలంటూ ఉపాధి, మండల పరిషత్ అధికారులపై పెత్తనం చెలాయిస్తుండటంతో అధికారులు లోలోన తీవ్రంగా మథనపడుతున్నారు. బయటకు చెప్పుకోలేక, విధులు నిర్వర్తిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇదంతా టీడీపీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు ప్రోద్బలంతోనే చేస్తున్నారంటూ అధికారులు చర్చించుకుంటున్నారు. ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్నామని గొప్పలు చెబుతున్న టీడీపీ నేతలు ఏకంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరిస్తూరంటూ అదే పార్టీలోని కొందరు నేతలు చర్చించుకోవడం గమనార్హం.

ఎస్‌ఐ ఉద్యోగం సాధించిన జ్యోతికి సన్మానం


జ్యోతిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు రేవన్న

బ్రహ్మసముద్రం : సూగేపల్లికి చెందిన కురుబ జ్యోతి తొలిప్రయత్నంలోనే ఎస్‌ఐ ఉద్యోగం సాధించడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం సన్మానించారు. కురుబ వన్నారెడ్డి , లక్ష్మీ దంపతులు వ్యవసాయ పనులు చేస్తూ కుమార్తెను ఉన్నత చదువులు చదివించారు. కురుబ జ్యోతి పోటీ పరీక్షల్లో మొదటి ప్రయత్నంలోనే ఎస్‌ఐగా ఎంపిక అయ్యింది. అనంతపురం పోలీస్ పరేడ్ మైదానంలో శిక్షణ పూర్తి చేసుకొని పాసింగ్ అవుట్ పరేడ్‌లో పాల్గొన్నారు. వైఎస్‌ఆర్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు కేఎం రేవన్న తదితరులు జ్యోతిని సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రఘు, దేవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా


సిరిగేదొడ్డి వద్ద డంప్ చేసిన ఇసుక

రాయదుర్గం: నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణాకు బ్రేకులు పడడం లేదు. రెండు రోజుల క్రితం పట్టణ సమీపంలో ఇసుక డంప్‌ను గుర్తించారు. తాజాగా గుమ్మఘట్ట మండలం సిరిగేదొడ్డి సమీపాన మరో ఇసుక డంప్ వెలుగుచూసింది. ఈ ఫొటోలు వాట్సాప్‌ల్లో వైరల్‌గా మా రా యి. రోజంతా వేదావతి హగరీల్లో తవ్వడం, ట్రాక్టర్ల ద్వారా డంప్‌లు పేర్చడం, చీకటి పడగానే టిప్పర్లలో కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తుండడం అనవాతీయిగా సాగుతోంది. ట్రాక్టర్‌కు రూ.1500 చెల్లించి కొంటున్నారు. దాన్ని మెలకాల్మూరు, చెల్లకెర, బళ్లారి, బెంగళూరు తదితర ప్రాంతాల్లో ధరను బట్టి విక్రయిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రకృతి సంపద తరిగిపోకుండా పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సంక్షిప్త సమాచారం

ఫారెస్ట్‌కు నిప్పు

శెట్టూరు: మండలంలోని అడవిగొల్లపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌కు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. శనివారం రాత్రి ఫారెస్ట్‌లోని ప్రధాన రాచర్లతిప్ప వద్ద పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడుతున్నాయి. ఫారెస్ట్ ఎఫ్‌ఎస్‌ఓ మల్లికార్జున, ఎఫ్‌బీఓ తిమ్మక్క మంటలను ఆర్పేందుకు ప్రయత్రించగా, అదుపుకాలేదన్నారు.

బొమ్మనహాళ్: కళ్యాణదుర్గం–బళ్లారి ప్రధాన రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలు నిప్పుపడి కాలిపోతున్నాయి. మొక్కలు నాటారుగానీ కంచె ఏర్పాటు చేయలేదు. పంట కోతలు ముగిసిన తర్వాత రైతులు పొలాల గట్లకు నిప్పు పెడుతుండటంతో మంటలు వ్యాపించి కాలిపోతున్నాయి.

నాటుసారాను పూర్తిగా నిర్మూలిద్దాం

కళ్యాణదుర్గం రూరల్: నాటుసారాను కళ్యాణదుర్గం పరిసర ప్రాంతాల్లో పూర్తిగా నిర్మూలిద్దామని పట్టణ ఎక్సైజ్ సీఐ హసీనా బాను తెలిపారు. శనివారం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో బెల్లం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. నాటుసారా నిర్మూలనలో భాగంగా పట్టణంలోని బెల్లాన్ని అధిక మొత్తంలో విక్రయించరాదన్నారు. వ్యాపారులు బెల్లాన్ని విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లోని వ్యక్తులు అధిక మొత్తంలో బెల్లాన్ని కొనుగోలు చేయడానికి షాపుల వద్దకు వస్తే ఎక్సైజ్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

సజావుగా పింఛన్ల పంపిణీ

బొమ్మనహాళ్: మండల వ్యాప్తంగా శనివారం సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ సజావుగా సాగింది. మొత్తం 6,431 మందికి గానూ రూ. 2.84 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా 5,854 మందికి 91 శాతం పింఛన్ సొమ్ము అందించినట్లు ఎంపీడీఓ విజయభాస్కర్ తెలిపారు.

కూడేరు: మండలంలో పింఛన్ పంపిణీని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి శనివారం పర్యవేక్షించారు. మండల వ్యాప్తంగా 5,530 మంది పింఛన్ లబ్ధిదారులుండగా రూ.2,40, 27,000 మంజూరైంది. తొలి రోజు 95 శాతం పంపిణీ జరిగింది.

చెర్లోపల్లివాసికి డాక్టరేట్ ప్రదానం


ఎం.వెంకటేశులు

కళ్యాణదుర్గం: కంబదూరు మండలం పి.చెర్లోపల్లికి చెందిన ఎం.వెంకటేశులుకు తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేటివ్ మేనేజ్‌మెంట్ (ఎంబీఏ) విభాగంలో డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ విషయాన్ని శనివారం ఎస్వీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ యం.దామ్లానాయక్ ఓ ప్రకటనలో తెలియజేశారు. శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం మేనేజ్‌మెంట్ విభాగ ఆచార్యులు పి.రఘునాథ్‌రెడ్డి గైడ్‌గా వ్యవహరించారు. ఈయన రాసిన పరిశోధన వ్యాసాలు ప్రముఖ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. 'అసెస్మెంట్ ఆఫ్ మార్కెటింగ్ ఛాలెంజెస్ కాంఫ్రాంటెడ్ బై ఫార్మాస్యూటికల్స్ కంపెనీస్ ఇన్ ఇండియా' అన్న సిద్ధాంత గ్రంథాన్ని కూడా రాశారు.

7న సామాజిక తనిఖీ ప్రజావేదిక

గుమ్మఘట్ట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 7న సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు ఉపాధి పథకంలో చేసిన 806 పనులకు గాను రూ.14,94,41,328 ఖర్చు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ పనులపై 18వ విడత సామాజిక తనిఖీ బృందం గత నెల 15 నుంచి ఈ నెల 6 వరకు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, 7న ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం

బొకుగుప్ప: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధికి స్థానికులు రూ.30వేలు శనివారం అందించినట్లు ఎంఈఓ మల్లారెడ్డి తెలిపారు. స్థానిక శ్రీనివాస విద్యానికేతన్ కరస్పాండెంట్ శ్రీనివాసులు రూ.20వేలు, పూర్వ విద్యార్థి ఆర్య వైశ్య సంఘం నాయకుడు మనోజ్‌కుమార్ రూ.10వేలు బడి రుణం తీర్చుకుందాం కార్యక్రమంలో భాగంగా హెచ్‌ఎం వెంకటప్రసాద్, పాఠశాల చైర్మన్ రుద్రయ్యకు అందించారు.

నేడు సామూహిక లలితా సహస్ర నామ పారాయణం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని చిందనూరు కల్యాణ మంటపంలో ఈనెల 2న ఉదయం 10 గంటలకు 150 మంది మహిళలతో సామూహిక లలితా సహస్ర నామ పారాయణం చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని రికార్డు చేసేందుకు చెన్నై నుంచి నోబుల్ వరల్డ్ రికార్డుకు చెందిన ఇద్దరు సభ్యులు రానున్నారు. ఈ మేరకు డ్యాన్స్ అకాడమీ టీచర్ జ్యోతి నగేష్ శనివారం వివరాలు తెలియజేశారు. తాము నిర్వహించనున్న ఈ కార్యక్రమం నోబుల్ వరల్డ్ రికార్డులో నమోదు కానున్నట్లు తెలిపారు. రాయదుర్గం, అనంతపురం, బెంగళూరు, మొలకాల్మూరు, కణేకల్లు, చెళ్లికెర ప్రాంతాల నుంచి మహిళలు రానున్నట్లు చెప్పారు.

సజావుగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం


రాయదుర్గంలో పరీక్ష కేంద్రానికి వెళ్తున్న విద్యార్థులు

రాయదుర్గంటౌన్: పట్టణంలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు శనివారం మొదటిరోజు ప్రశాంతంగా పూర్తయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ఏపీ మోడల్ కళాశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటి రోజు ప్రథమ సంవత్సర విద్యార్థులు 1,345 మందికిగాను 1,300 మంది హాజరై తెలుగు, ఉర్దూ, హిందీ పరీక్ష రాసినట్లు చీఫ్ సూపరింటెండెంట్లు విజయభాస్కర్, విజయలక్ష్మీ, అశోక్‌రెడ్డి తెలిపారు.

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్ పరీక్షలను ప్రారంభించారు. 258 మంది హాజరు కావాల్సి ఉండగా ఐదుగురయ్యారని ప్రిన్సిపాల్ మోహన్‌కుమార్ తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు 26 మంది గైర్హాజరు

కణేకల్లు: కణేకల్లు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శనివారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష ప్రారంభమైంది. తొలిరోజు తెలుగు, హిందీ, జీఎఫ్‌సీ (జనరల్ ఫౌండేషన్ కోర్స్) పరీక్షలు జరిగాయి. మొత్తం 436 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 410 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ ఆంజనేయులు తెలిపారు.

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గంలో మూడు పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ విద్యార్థులు పరీక్షలు రాశారు. వివేకానంద జూనియర్ కళాశాలలో 556 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 16 మంది గైర్హాజరయ్యారు. 540 మంది పరీక్షలు రాశారు. ఎట్టణ సీఐ యువరాజు ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

ఉరవకొండ: స్థానిక ఎస్‌కే ఇంటర్ బాలుర, బాలికల కళాశాలలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాల్లో శనివారం ప్రశాంతంగా మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాలను చీఫ్‌లు ప్రసాద్, రమేష్ పర్యవేక్షించారు.

విధుల్లోకి చేరిన పంచాయతీ కార్యదర్శులు

కూడేరు: కలగళ్ల పంచాయతీ కార్యదర్శి సత్యసింహ, ముద్దలాపురం కార్యదర్శి మల్లికార్జున రెడ్డి, అరవకూరు కార్యదర్శి వివేకానందరెడ్డి, జల్లిపల్లి కార్యదర్శి పరమేష్, చోళసముద్రం కార్యదర్శి సుభాషిణిలు మూడు నెలలుగా సెలవులో ఉన్నారు. శనివారం వారు విధుల్లోకి చేరారు. ఎంపీడీఓ కుళ్లాయిస్వామిని కలిసి జాయినింగ్ రిపోర్టులు అందజేశారు.

ఎస్‌ఎస్ ట్యాంకులోకి తుంగభద్ర జలాలు

రాయదుర్గంటౌన్: హెచ్చెల్సీకి తుంగభద్ర జాలాలు విడుదల చేయడంతో కణేకల్లులోని ఎస్‌ఎస్ ట్యాంకులోకి మరోసారి నీటి పంపింగ్‌కు అవకాశం లభించింది. రాయదుర్గానికి తాగునీటిని అందిస్తున్న డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శాశ్వత మంచినీటి పథకం సమ్మర్ స్టోరేజీ ట్యాంకులోకి హెచ్చెల్సీ నుంచి తుంగభద్ర జలాల పంపింగ్ శనివారం ప్రారంభించారు. కేసీ కెనాల్ వాటాలో 0.5 టీఎంసీల నీటిని హెచ్చెల్సీకి విడుదల చేసిన విషయం తెలిసిందే. దీంతో ఎస్‌ఎస్ ట్యాంకులోకి మరో పదిరోజుల పాటు తుంగభద్ర జలాలను పంపింగ్ జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. మూడు మోటార్ల ద్వారా రోజుకు 20 ఎంఎల్‌డీ నీటిని పంపింగ్ చేస్తున్నట్లు చెప్పారు. ఎస్‌ఎస్ ట్యాంకు పూర్తి స్థాయి నీటిమట్టం 3,052 మిలియన్ లీటర్లు కాగా, ప్రస్తుతం 2,980 మిలియన్ లీటర్ల నీరు (ఎంఎల్‌డీ) నిల్వ ఉన్నట్లు చెప్పారు. రెండురోజులకోసారి పట్టణంలో 11 ఎంఎల్‌డీ నీటిని ప్రజలకు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు.

రంజాన్ మాసం వెలుగులు నింపాలి


మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గంటౌన్: పవిత్ర రంజాన్ మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని ముస్లింలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టుగోవిందరెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ మాసం అంటే కేవలం ఉపవాస దీక్షలు కాదని, మనిషి ఆకలి విలువ తెలియజేస్తుందన్నారు. ఉపవాస దీక్షలతో మనిషి తన చెడు అలవాట్లను, కోపాన్ని, ద్వేషాన్ని విడనాడేందుకు అల్లా ప్రసాదించిన గొప్ప అవకాశం అన్నారు. ముస్లింలు నియమనిష్టలతో చేపట్టే రంజాన్ మాసం వారి జీవితాల్లో వెలుగులు నిండాలని, నిత్యం అల్లా దీవెనలు వారి వెంట ఉండాలని ఆకాంక్షించారు.

అన్ని వర్గాలనూ మరోసారి మోసగించిన కూటమి

రాయదుర్గంటౌన్: చిత్తశుద్ధిలేని బడ్జెట్‌తో అన్ని వర్గాల ప్రజలను కూటమి ప్రభుత్వం మరోసారి నిలువునా మోసం చేసిందని రాయదుర్గం వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు చిత్ర రవీంద్ర రెడ్డి విమర్శించారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికలకు ముందు ఇంటికో ఉద్యోగం, లేకుంటే ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి హామీని తుంగలో తొక్కినట్లు చెప్పారు. బడ్జెట్‌లో కనీసం దీని ఊసే లేకపోవడం దారుణమన్నారు. తల్లికి వందనం పథకానికి అరకొర కేటాయింపులతో వంచనకు గురిచేశారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు కేవలం ఊహించుకోవడానికే తప్ప.. రైతులు, మహిళలు, నిరుద్యోగులకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ


సైకిళ్లను పంపిణీ చేస్తున్న స్పెయిన్ దేశస్తులు, ఆర్డీటీ ప్రతినిధులు

బొమ్మనహాళ్: సుదూర ప్రాంతాల నుంచి నడిచి వెళ్లి విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకోసం ఆర్డీటీ సైకిళ్లను పంపిణీ చేసింది. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆర్డీటీ ఆధ్వర్యంలో 30 మంది స్పెయిన్ బృందం 67 మందికి సైకిళ్లను పంపిణీ చేశారు. ఆర్డీటీ ఉరవకొండ రీజినల్ డైరెక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ హరేసముద్రం, ఉంతకల్లు గ్రామాల విద్యార్థులు రోజూ బొమ్మనహాళ్ ఉన్నత పాఠశాలకు నడిచి వెళ్తున్నారన్నారు. పేద విద్యార్థినులు బడి మానేయకుండా ఉండేందుకు సైకిళ్లను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులు, స్పెయిన్ దేశస్తులు చేసిన డాన్సులు అలరించాయి. ఎంఈఓ మల్లికార్జున, హెచ్‌ఎం రాజ్‌కుమార్, ఆర్డీటీ ఏటీఎల్ వెంకటేశులు, సీఓలు కృష్ణప్ప, కృష్ణ పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం

కూడేరు: మండల కేంద్రంలోని దళితవాడకు చెందిన మనుమల కిరణ్‌కుమార్ అనే యువకుడు అదృశ్యమైనట్లు పోలీసులు శనివారం తెలిపారు. కిరణ్ కుమార్ తండ్రి నాగేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.